క్లుప్తంగా

నియామకం



లింగయ్య

జమ్మికుంట: ఎస్సీ 57 ఉపకులాల హక్కుల పోరాట సమితి ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షుడిగా జమ్మికుంట పట్టణానికి చెందిన తూ ర్పాటి లింగయ్యను అధ్యక్షుడు సిరిపాటి వేణు ఆధ్వర్యంలో మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకొని నియామకపత్రం అందజేశారు. లింగయ్య.. మాట్లాడుతూ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఉప కులాల హక్కుల కోసం ఉద్యమిస్తానని, నియామకానికి సహకరించిన రాష్ట్ర కార్యదర్శి గడ్డం సమ్మయ్య, నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపాడు.

దేశాయిపేట గౌడ సంఘం

చొప్పదండి: మండలంలోని దేశాయిపేట గ్రామ గౌడ సంఘం నూతన అధ్యక్షుడిగా పెరుమాళ్ల రవీందర్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా పాకాల మల్లేశం, డైరెక్టర్లుగా సుద్దాల శ్రీనివాస్ గౌడ్, పెరుమాండ్ల వీరేశం, పల్లె రాములు, వడ్లకొండ కొమురయ్య, సుద్దాల రాములు, పచ్చిమట్ల మురళి, కందుల నారాయణగౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గీత కార్మికుల సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని రవీందర్‌గౌడ్ తెలిపారు.

20న హుజూరాబాద్‌కు మంద కృష్ణమాదిగ



మాట్లాడుతున్న వెంకటస్వామి

హుజూరాబాద్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ ఈ నెల 20న హుజూరాబాద్‌కు వస్తున్నారని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి ఇంజం వెంకటస్వామి తెలిపారు. మంగళవారం స్థానిక ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో మహజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తునికి వసంత్ అధ్యక్షతన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు... కరీంనగర్ పార్లమెంట్ పరిధి ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల సంయుక్త సమావేశం 20న హుజూరాబాద్‌లోని సాయిరూప ఫంక్షన్ హాల్‌లో జరుగుతుందని, సమావేశానికి ముఖ్య అతిథిగా మంద కృష్ణమాదిగ హాజరై నాయకులు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేస్తారని, కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, యువసేన, మహిళా సమాఖ్య నాయకులు, కార్యకర్తలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు రుద్రారపు రామచంద్రం, రాష్ట్ర నాయకులు మారెపల్లి శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవునూరి రవీందర్, ఎమ్మార్పీఎస్ హుజూరాబాద్ మండల అధ్యక్షుడు బొరగాల రాజ్‌కుమార్, మొలుగూరి ప్రభాకర్, కలవల మల్లయ్య, తెలంగాణ రాములు తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ అంటే మోసం,దగా'

సైదాపూర్: బీజేపీ అంటేనే మోసం, దగా అని డీసీసీ అధికార ప్రతినిధి మ్యాకల రవీందర్ ఆరోపించారు. మండల కేంద్రంలో మంగళవారం మాట్లాడారు. పదేళ్ల క్రితం నల్లధనం బయటకు తీసి ప్రతి పేదవాడి ఖాతాల్లో వేస్తామని నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చారని, అధికారంలోకి రాగానే నోట్ల రద్దుతో నల్లధనం వైట్ మనీగా మార్చారని, అక్రమార్కులకే లాభం చేశారని అన్నారు. జన్‌ధన్ బ్యాంకు ఖాతాల్లో లక్షలు వేస్తామన్న మోదీ పన్నుల రూపంలో పేదల డబ్బులే దోచుకుంటున్నాడని ఆరోపించారు. చాయ్ అమ్మి ప్రధాని అయ్యానని చెప్పుకుంటున్న మోదీ ఈ రోజు హోటల్లో చాయ్ తాగిన వారి నుంచి జీఎస్టీ రూపంలో పన్నులు లాగుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. పదేండ్లలో మతపిచ్చి లేపారని ప్రజలకు ఉపయోగపడే పని చేయలేదన్నారు.

పనులు ప్రారంభించకుంటే ఆమరణ నిరాహార

చిగురుమామిడి: మండలంలోని ఇందుర్తి, గాగిరెడ్డిపల్లి, సుందరగిరి గ్రామాల మధ్య రూ.19 కోట్లతో నిర్మించనున్న తారురోడ్డు పనులను వారం రోజుల్లో ప్రారంభించకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని బీజేపీ నాయకుడు, గ్రామ సొసైటీ అధ్యక్షుడు మంద శ్రీనివాస్ అన్నారు. మంగళవారం చిగురుమామిడిలో మాట్లాడారు. డబుల్ రోడ్డు నిర్మాణానికి ఎంపీ కోటా నుంచి నిధులు మంజూరయ్యాయని, ఉన్న రోడ్డును తొలగించిన కాంట్రాక్టర్ కంకరపోసి వదిలివేశాడని, దీంతో రాకపోకలకు ఇబ్బందిగా మారిందన్నారు. దుమ్ము ధూళితో వాహనదారులు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

మద్యం పట్టివేత

జమ్మికుంట: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ముగ్గురిని పట్టుకొని మంగళవారం కేసు నమోదు చేశామని టౌన్ సీఐ వరగంటి రవి తెలిపారు. పట్టణంలో కృష్ణాకాలనీలోని ఓ వ్యక్తి వద్ద రూ.4,300, ఎఫ్‌సీఐ సమీపంలోని ఓ వ్యక్తి వద్ద రూ.1,480, మండలంలోని సైదాబాద్ గ్రామానికి మరో వ్యక్తి వద్ద రూ.2,100 విలువ చేసే మద్యం పట్టుకున్నామని, బెల్టు షాపు నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు సోదాలు నిర్వహించామన్నారు.

పదేపదే విద్యుత్ వైరు చోరీ

- ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అందని తాగునీరు
- ఇబ్బందులు పడుతున్న రోగులు, వైద్యసిబ్బంది
- నిరుపయోగంగా పీహెచ్‌సీ బోర్‌వెల్



మానకొండూర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

మానకొండూర్: మానకొండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తాగునీటి కోసం ఆసుపత్రికి వచ్చే వారితోపాటు వైద్యసిబ్బంది తండ్లాట పడుతున్నారు. బోరుబావి ఉన్నా ప్రయోజనం లేకుండా పోయింది. బోరుబావి పూడుకుపోవడంతో నిరుపయోగంగా ఉంది. అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నా తాగునీరు మాత్రం అందడం లేదు. ఆరోగ్య కేంద్రానికి సమీపంలోని గ్రామ పంచాయతీ మంచినీటి బావి నుంచి నీటిని ఉపయోగించుకునేదుంకు బావిలో మోటారు బిగించి నీటిని పీహెచ్‌సీ తరలిస్తుంటే గుర్తు తెలియని వ్యక్తులు పదేపదే విద్యుత్ వైరును చోరీ చేస్తుండటంతో నీటి సరాఫరా నిలిచిపోతోంది.

మూడు నెలలుగా ఇబ్బందులే...

పీహెచ్‌సీలో మూడు నెలల నుంచి తాగునీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రతిరోజు ఆరోగ్య కేంద్రానికి 60 నుంచి వందమంది రోగులు వస్తుంటారు. ఆరోగ్య కేంద్రం పరిధిలోని సిబ్బందితో నెలలో రెండు, మూడుసార్లు సమావేశాలు జరుగుతుంటాయి. ఆరోగ్య కేంద్రం సమీపంలో బోరుబావిని ఏర్పాటు చేసి మొదట తాగునీరు అందించిన కాలక్రమేణ బోరుబావి పూడుకుపోయింది. దీంతో ఆరోగ్య కేంద్రానికి తాగునీరు అందడం గగనమైంది. ఆరోగ్య కేంద్రంలోని వాష్‌రూంలకు సరిపడా నీరు ఉండటం లేదని వైద్యసిబ్బంది వాపోతున్నారు. సమావేశాల సందర్భంగా నీటి అవసరం చాలా వరకూ ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలలుగా నీటి కోసం అవస్థలు పడుతున్నామని అధికారులు, రోగులు వాపోతున్నారు.

ప్రత్యామ్నాయ చర్యలు.. ప్రయోజనం శూన్యం

పీహెచ్‌సీకి తాగునీరు అందించేందుకు అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నా ఫలించడం లేదు. ఆరోగ్య కేంద్రం సమీపంలోని గ్రామ పంచాయతీ మంచినీటి బావిలో మోటారు బిగించి పైపులైన్ ద్వారా ఆరోగ్య కేంద్రానికి నీటిని తరలించి నీటి సమస్యకు చెక్ పెట్టినా ఆ తర్వాత మళ్లీ అదే సమస్య రిపీట్ అవుతోంది. విద్యుత్ వైరును తరచూ గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్తుండటంతో నీటి సరాఫరా నిలిచిపోతోంది. ఇటీవల ఏర్పాటు చేసిన విద్యుత్ వైరు చోరీకి గురైంది. దీంతో మంచినీటి బావి నుంచి తాగునీటి సరాఫరా నిలిచిపోయింది. బయట నుంచి వాటర్ క్యాన్లలో తాగునీటిని తెప్పించుకుంటూ దాహం తీర్చుకుంటున్నారు. నీటి సమస్య ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారింది. మరో బోరుబావిగానీ లేదా విద్యుత్ వైరు చోరీ కాకుండా చూడాలని కోరుతున్నారు. అందుకోసం రెండు విద్యుత్ పోల్స్, ఎత్తైన ఇనుపరాడ్లు వేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

నీటి వసతి కల్పించాలి

ఆరోగ్య కేంద్రంలో తాగునీటి ఇబ్బందులున్నాయి, పీహెచ్‌సీ బోరుబావి పూడుకు పోయింది, పక్కన ఉన్న మంచినీటి బావిని వినియోగించుకుంటుంటే విద్యుత్ వైరును దొంగలు ఎత్తుకెళ్తున్నారు. రెండు మూడు సార్లు విద్యుత్ వైరును సమకూర్చిన మళ్లీ దొంగలు ఎత్తుకెళ్లారు. ఆరోగ్య కేంద్రానికి నీటి వసతి కల్పించి ఇబ్బందులు తొలగించాలి.

– రాజ్‌నాయక్, సీహెచ్‌వో

సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకోవాలి



మాట్లాడుతున్న కళాశాల డైరెక్టర్ శంకర్

హుజూరాబాద్‌రూరల్: విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకోవాలని కిట్స్ కళాశాల డైరెక్టర్ కె. శంకర్ అన్నారు. మండలంలోని సింగాపూర్ గ్రామం కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం సైబర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బ్రెయిన్ ఓ విజన్ హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో మొబైల్ ఇంటర్ ఫేస్ టెక్నాలజీపై వారం రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శాస్త్రసాంకేతిక రంగంలో రోజురోజుకు వస్తున్న మార్పులను విద్యార్థులు గమనించాలని, సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మొబైల్ అప్లికేషన్ రంగంలో చాలా అవకాశాలు ఉన్నాయని, విద్యార్థులు కొత్త సాంకేతిక అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె. ఈశ్వరయ్య, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగాధిపతి కళాశాల ఎన్‌సీసీ అధికారి కెప్టెన్ డాక్టర్ కె. రవీంద్రబాబు, సమన్వయకర్తలు పవన్, రఘు, భాస్కర్, ప్రకాష్, రఘుపతి, ప్రవీణ్ ఉన్నారు.

మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్ జీ



యువతకు కౌన్సెలింగిస్తున్న ఏసీపీ శ్రీనివాస్ జీ

హుజూరాబాద్: తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్ జీ సూచించారు. హుజూరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో పరిధిలో గంజాయి సేవిస్తున్న, విక్రయిస్తున్న 24 మంది యువకులకు మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, గంజాయి లాంటి వాటికి బానిసైతే వచ్చే అనారోగ్య సమస్యలను వివరించారు. వీటి బారిన పడకుండా ఉండాలని, ఎక్కడనైనా గంజాయి విక్రయించినా లేదా సేవించినా పోలీసులకు సమాచారం తెలపాలని కోరారు. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టౌన్ సీఐ బొల్లం రమేష్, ఎస్సై సాంబయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీ అయిన టీచర్లను రిలీవ్ చేయాలి



మాట్లాడుతున్న నర్సింహస్వామి

హుజూరాబాద్: స్కూల్ అసిస్టెంట్ల 2023 బదిలీల్లో చాలామంది ఉపాధ్యాయులు రిలీవ్ కాలేదని తద్వారా సుదూర ప్రాంతాల్లో విధులు నిర్వహించడం వల్ల ఇబ్బందులకు గురవుతున్నారని, విద్యా సంవత్సరం చివరి పని దినం 23వ తేదీన బదిలీ అయిన పాఠశాలలో చేరేందుకుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలని తెలంగాణ టీచర్స్ యూనియన్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏరుకొండ నర్సింహస్వామి, జిల్లా అధ్యక్షుడు పొలంపల్లి ఆదర్శన్‌రెడ్డి కోరారు. పట్టణంలో మంగళవారం హుజూరాబాద్, జమ్మికుంట, ఇల్లందకుంట మండలశాఖముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతి, ఆయా మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కిషన్‌రెడ్డి, నాగరాజు, గోపి, వేణుగోపాల్, దానంపల్లి శ్రీనివాస్, పత్తెం శ్రీనివాస్, కొండాల్‌రెడ్డి, జయశ్రీ, సీనియర్ నాయకులు డి.సుధాకర్ పాల్గొన్నారు.

కూలి రేట్లు పెంచాలని ఆందోళన



ప్లాంట్ ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు, సీపీఐ నాయకులు

శంకరపట్నం: కూలి రేట్లు పెంచాలని డిమాండ్ చేస్తూ మండలంలోని కావేరి సీడ్స్ ప్లాంట్ ఎదుట హమాలీలు మంగళవారం ఆందోళన చేశారు. మొలంగూర్ గ్రామంలో సీడ్ ప్లాంట్‌లో ఏడేళ్లుగా పని చేస్తున్నామని, గతంలో బస్తాకు మూడు రూపాయలు చెల్లించారని, మార్చిలో 30 పైసలు అదనంగా పెంచారని, ఇతర ప్రాంతాలలో బస్తాకు రూ.3.90 పైసలు చెల్లిస్తున్నారని, ఇక్కడ రూ.3.30 పైసలు చెల్లిస్తామనడం సరికాదని నిరసన వ్యక్తం చేశారు. బిహార్ కార్మికులకు మద్దతుగా సీపీఐ మండల కార్యదర్శి పిట్టల సమ్మయ్య, హమాలీల సంఘం మండల అధ్యక్షుడు బాబా, వామపక్ష నాయకుడు లింగంపల్లి శ్రీనివాస్‌రెడ్డి సంఘీభావం తెలిపారు. కార్మికులను విచ్ఛిన్నం చేయడానికి ప్లాంట్‌లోని ఉద్యోగులు ప్రయత్నిస్తున్నారని సీపీఐ మండల కార్యదర్శి సమ్మయ్య ఆరోపించారు. ఇతర ప్రాంతాల్లో చెల్లించిన విధంగానే ఇక్కడ చెల్లించాలని, కూలి రేట్లు పెంచే వరకు పనులు జరగనివ్వమన్నారు. దీంతో కంపెనీకి చెందిన ఉద్యోగులు హమాలీలతో సంప్రదింపులు జరిపారు. కూలిరేట్ల పెంపు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్తామని కంపెనీ ప్రతినిధులు హామీ ఇవ్వడంతో శాంతించారు. సమస్య పరిష్కారం కాకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని సమ్మయ్య హెచ్చరించారు.

గ్యాస్ లీకేజీలతో ఆందోళన చెందొద్దు



మంటలను ఎలా ఆర్పివేయాలో వివరిస్తున్న అగ్నిమాపక సిబ్బంది, అధికారులు

మానకొండూర్: ఇంట్లోని వంట గ్యాస్ లీకేజీలతో ఆందోళన చెందొద్దని మానకొండూర్ ఫైర్ ఆఫీసర్ డి.భూదయ్య అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని మార్కెట్ యార్డు వద్ద అగ్నిప్రమాదాల నివారణపై మంగళవారం ప్రజలకు అవగాహన అగ్నిమాపక సిబ్బంది అవగాహన కల్పించారు. గ్యాస్ లీకై మంటలు వస్తే గోనే సంచి లేదా తడిగుడ్డను సిలిండర్ చుట్టూ చుడితే మంటలు రావని తెలిపారు. సిలిండర్ ఉన్న చోట వెలుతురు ఉండేలా చూసుకోవాలని, అప్పుడప్పుడు గ్యాస్ పైపును పరిశీలించాలని సూచించారు. వేసవిలో ప్రజలు అగ్నిప్రమాదాలతో జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జి. ధర్మ, వినోద్ కుమార్, బి. సతీష్, ఎన్ నరేందర్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో భీమేశ్

జమ్మికుంట: మండలంలోని గ్రామాల్లో వేసవి దృష్ట్యా తాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో భీమేశ్ అన్నారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం కార్యదర్శులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. గ్రామాల్లో తాగునీటి సమస్యలుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. ఉపాధి హామీ కూలీల సంఖ్య పెంచాలని, పనులు సజావుగా జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ సతీశ్ కుమార్, కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను వినియోగించుకోవాలి



హన్మాజిపల్లెలో అంగన్‌వాడీ వార్షికోత్సవం

గన్నేరువరం: మండలంలోని గన్నేరువరం ఒకటో, హన్మాజిపల్లె గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. పిల్లలకు ఆటాపాటలతో పాటు వారి అభివృద్ధి, కేంద్రంలో నిర్వహించే కార్యక్రమాలను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇష్రత్ సుల్తానా వివరించారు. కేంద్రాల్లో పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందిస్తున్నామని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంగన్‌వాడీ టీచర్లు రేణుక, నిర్మల, ఆయాలు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ఇంటింటి ప్రచారం



జమ్మికుంట: ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు



గన్నేరువరం: మైలారంలో...



చిగురుమామిడి: గాగిరెడ్డిపల్లిలో...

జమ్మికుంట: పట్టణంలోని 13వ, 16వ వార్డుల్లో కొమ్ము అశోక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్‌కు మద్దతుగా మంగళవారం ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం పథకాలను ప్రజలకు వివరించారు. .

గన్నేరువరం: మండలంలోని మైలారంలో ఆయా బూత్‌లలో బీజేపీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ముచ్చటగా మూడోసారి నరేంద్ర మోదీ ప్రధాని కావాలని యావత్ భారతవని ఆకాంక్షిస్తోందన్నారు. ఇది నెరవేరడానికి కమలం గుర్తుపై ఓటు వేసి ఎంపీగా బండి సంజయ్‌కుమార్ గెలిపించాలని కోరారు. నరేంద్రమోదీ సారథ్యంలో భారత్ అభివృద్ధిలో దూసుకెళ్లోందని తెలిపారు.

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ అనుబంధ గ్రామాల్లో బీజేపి నాయకులు ఇంటింటికి ప్రచారం చేశారు. కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలతోపాటు కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ జిల్లాకు తీసుకువచ్చిన నిధుల కరపత్రాలను పంపిణీ చేశారు.

రామడుగు: మండలంలోని రంగసాయిపల్లిలో బీజేపీ నాయకులు కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థిగా బండి సంజయ్‌కుమార్‌ను రెండోసారి గెలిపించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం చేశారు. కరపత్రాలను పంపిణీ చేశారు.

చిగురుమామిడి: త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ రాష్ట్రంలో అత్యధిక స్థానాల్లో గెలుస్తుందని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, హుస్నాబాద్ నియోజకవర్గ ఎన్నికల కోఆర్డినేటర్ కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. మంగళవారం బీజేపీ నాయకులతో కలిసి మండలంలోని గాగిరెడ్డిపల్లి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ గ్రామానికి వెళ్లినా బీజేపీ కి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, భారతావని ప్రధానిగా నరేంద్రమోదీని కోరుకుంటుందని, కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బండి సంజయ్‌కుమార్ అత్యధిక మెజార్టీతో గెలుపొందుతారని తెలిపారు.

పలువురి బైండోవర్

గన్నేరువరం: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 11 మంది బెల్ట్‌షాపుల నిర్వాహకులను మంగళవారం తహసీల్దార్ భిక్షపతి ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. మాదాపూర్, ఖాసీంపేట, గునుకులకొండాపూర్ గ్రామాలకు చెందిన మాడుగుల సంతోష్‌రెడ్డి, మాడుగుల బాల్‌రెడ్డి, నాగుల ఆంజనేయులు, మహేశ్, నూనె నర్సింహారెడ్డి, అక్కెన వైకుంఠం, మల్లేశం, తాళ్లపల్లి శ్రీపాల్, తాళ్లపల్లి అంజయ్య, సుధగోని కిష్టస్వామి, కనపర్తి శ్రీధర్‌ను బైండోవర్ చేశామన్నారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే జైలుశిక్ష, జరిమానా తప్పదని హెచ్చరించారు.

మానకొండూర్: మండలంలోని పలు గ్రామాలకు చెందిన 20 మందిని తహసీల్దార్ రాజు ఎదుట మంగళవారం బైండోవర్ చేశామని సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ముందస్తుగా బైండోవర్ చేశామన్నారు.

ప్రశ్నించే గొంతుకను గెలిపించాలి

చొప్పదండి: పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ ఎంపీగా ప్రశ్నించే గొంతుక బోయినపల్లి వినోద్‌కుమార్‌ను గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. పట్టణంలో బీఆర్‌ఎస్ బూత్ స్థాయి నాయకుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిందని, కల్యాణలక్ష్మి చెక్కులతో పాటు తులం బంగారం ఏదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటుతో కరువు వచ్చిందని ప్రజలు గుర్తించాలన్నారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలలో ఏ ఒక్కటి పూర్తి స్థాయిలో అమలు కాలేదని విమర్శించారు. ఈ సమావేశంలో ఏనుగు రవీందర్‌రెడ్డి, వెల్మ శ్రీనివాస్ రెడ్డి, లోక రాజేశ్వర్‌రెడ్డి, మినుపాల తిరుపతిరావు, ఆరెల్లి చంద్రశేఖర్‌గౌడ్, గడ్డం చుక్కరెడ్డి, వల్లాల కృష్ణహరి, చీకట్ల రాజశేఖర్, డాక్టర్ అమిత్, తదితరులు పాల్గొన్నారు.

బుంగను పూడ్చాలి



బుంగ పడిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సంపత్

మానకొండూర్: మానకొండూర్ చెరువు మత్తడికి సమీపంలో బుంగపడటంతో సాగునీరు వృథాగా పోతోందని, బుంగను పూడ్చాలని సీపీఎం మానకొండూర్ జోన్ కార్యదర్శి సుంకరి సంపత్ డిమాండ్ చేశారు. మంగళవారం చెరువుకట్టను పరిశీలించి మాట్లాడారు. వర్షాకాలంలో బుంగ పడితే ఇప్పటివరకు మరమ్మతు చేయలేదని, అలాగే తూము ప్రాంతంలో కాంక్రీటు కింది నుంచి చెరువులోని సాగు నీరు వృథాగా వెళ్తుందన్నారు. కోట్ల రూపాయలు చెరువుకట్ట మరమ్మతు కోసం ఖర్చు చేస్తున్నా ఇంకా లోపాలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువుపై అనేక కులాలు ఆధారపడి బతుకుతున్నాయని వెంటనే చెరువు కట్ట వద్ద ఏర్పడిన బుంగ, నీటి లీకేజీ అరికట్టాలన్నారు. ఆయన వెంట నాయకులు సతీష్, తిరుపతి, శ్రీనివాస్, రాకేష్, రాజు, వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్ల అందజేత



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో సాకేత్ రామారావు

కరీంనగర్: హైదరాబాద్‌లోని పలు కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ పూర్తి చేసుకున్న నగరంలోని కిమ్స్ డిగ్రీ, పీజీ కళాశాల ఫుడ్ సైన్స్ విద్యార్థులకు మంగళవారం కిమ్స్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ సాకేత్ రామారావు ఇంటర్న్‌షిప్ సర్టిఫికేట్లు అందజేశారు. ఈ సందర్భంగా సాకేత్ రామారావు మాట్లాడుతూ ఫుడ్ సైన్స్, న్యూట్రిషన్ డిగ్రీ, పీజీ విద్యార్థులకు యేటా వివిధ కంపెనీలు, ఆస్పత్రుల్లో ఇంటర్న్‌షిప్ కల్పిస్తూ ఉద్యోగాలు అందిస్తున్నామన్నారు. హైదరాబాద్‌లోని మోడ్రన్ ఫుడ్స్, బేక్మెట్, తెలంగాణ ఫుడ్స్, తునవ్ ఫుడ్స్, క్రౌన్ బీర్, కరీంనగర్ డెయిరీ, విజయ డెయిరీలతో పాటు పలు కంపెనీల్లో కళాశాలలోని డిగ్రీ విద్యార్థులు 45 రోజులు, పీజీ విద్యార్థులు 90 రోజులు ఇంటర్న్‌షిప్ పూర్తి చేసుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ అర్జున్‌రావు, విభాగాధిపతి మహేశ్, అధ్యాపకులు అంజలి, ప్రణయ, సంపత్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

పనుల్లో నిమగ్నం కావాలి

కరీంనగర్‌టౌన్: రానున్న పార్లమెంట్ ఎన్నికల కోసం పార్టీ ఆధ్వర్యంలో నియమించిన ఎన్నికల బాధ్యులందరూ తమ పనుల్లో నిమగ్నం కావాలని బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు అన్నారు. మంగళవారం సాయంత్రం బీ జేపీ పార్లమెంట్ ఎన్నికల కార్యాలయంలో జరిగిన ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశంలో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్‌ను భారీ మెజారిటీతో గెలి పించడానికి తగిన కార్యాచరణతో ముందు కొనసాగాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకు పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మేనేజ్‌మెంట్ కమిటీ తగిన కృషి చేయాలన్నారు. ఎన్నికల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన కమిటీలో ఉన్న ప్రతిఒక్కరూ తమ బాధ్యతలను విధిగా చేపట్టాలన్నారు. ఈ స మావేశంలో కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల మేనేజ్‌మెంట్ నిర్వహణ బాధ్యులు, పార్లమెంటు పరిధి లోని అసెంబ్లీ కన్వీనర్లు, జిల్లా బాధ్యులు పాల్గొన్నారు.